రేషన్.. పరేషాన్



రేషన్ దుకాణం వద్ద కార్డుదారుల నిరీక్షణ

- ఒకేసారి మూడు నెలల బియ్యం తీసుకోవడానికి లబ్ధిదారుల అవస్థలు
- సర్వర్ సమస్యతో పంపిణీలో జాప్యం
- దుకాణాల వద్ద గంటల తరబడి పడిగాపులు
- సాంకేతిక సమస్యను పరిష్కరించాలని వేడుకోలు

మేళ్లచెరువు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తెల్లరేషన్ కార్డుదారులకు మూడు నెలల బియ్యం ఒకేసారి ముందస్తుగా పంపిణీ చేస్తున్నాయి. ఒక్కో యూనిట్‌కు కేంద్ర ప్రభుత్వం 5కిలోలు, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో కిలో కలిపి మొత్తం ఆరు కిలోల చొప్పున అందిస్తుంది. సన్నం బియ్యం అందుతాయో లేవోనన్న ఆందోళనతో దుకాణాల వద్దకు లబ్ధిదారులు బారులుదీరుతున్నారు. గంటల తరబడి లైన్లలో నిలబడలేక సంచులు, కార్డులు క్యూలో ఉంచి వేచి చూస్తున్నారు. మరోవైపు సర్వర్‌లో తలెత్తిన లోపంతో రోజంతా పడిగాపులు కాస్తూ నిరాశతో బియ్యం తీసుకోకుండానే ఇళ్లకు వెళ్తున్నారు.

బయోమెట్రిక్ సమస్యలతో..

రేషన్ పంపిణీలో బయోమెట్రిక్ విధానం ప్రధాన అడ్డంకిగా మారింది. సాధారణంగా ప్రతినెలా ఒక్కసారి వేలిముద్ర వేయడంతో బియ్యం పొందే లబ్ధిదారులు ఈ సారి మూడు నెలల రేషన్ కోసం మూడు నుంచి ఆరు సార్లు బయోమెట్రిక్ వేయాల్సి వస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే 5కిలోలకు ఒక సారి, రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే కిలో బియ్యానికి మరో సారి వేలిముద్ర వేయాల్సివస్తుండడతో వేర్వేరుగా కాంటా వేయడం ద్వారా ఒక్కో లబ్ధిదారుడు రేషన్ తీసుకోవడానికి సమారు 20నిమిషాలకు పైగా సమయం పడుతుంది. దుకాణాదారుడు ఈ - పాస్ యంత్రం ఓపెన్ చేసి కార్డు నంబర్ కొడితే కుటుంబ సభ్యుల పేర్లు వస్తాయి. వచ్చిన వ్యక్తి కార్డులో సభ్యుడు అయితే అతడితో వేలిముద్ర వేయిస్తారు. అది ఓకే కావడానికి రెండు నిమిషాల సమయం పడుతుంది. మిషన్‌లో జూన్, జూలై, ఆగస్టు నెలల ఓపెన్ అవుతాయి. వేలిముద్ర ఓకే ఐతే ఒక నెల సెలెక్టు చేసి బ్లూటూత్ అనుసంధానం చేసి ఎలక్ట్రానిక్ మీద సరుకులను సమాన బరువు ఉంచడంతో ఒక నెల పూర్తివుతుంది. వెంటనే మరోనెల ఇలా చేయాల్సివస్తుంది. దీంతో మూడు నెలల బియ్యం ఇవ్వాడానికి 20నుంచి 30నిమిషాల వరకు సమయం పడుతుంది. సర్వర్ మొరాయిస్తే మరో అరగంట పడుతుంది. దీంతో డీలర్లు రోజుకు ఎక్కువ మొత్తంలో బియ్యం ఇవ్వలేకపోతున్నారు. గతంలో 5నిమిషాల్లో ఇదంతా పూర్తయ్యేది.

భారీగా క్యూ కడుతున్న లబ్ధిదారులు..

రేషన్ దుకాణాల వద్ద ఉదయం 6గంటల నుంచే లబ్ధిదారులు భారీగా క్యూలో ఉంటున్నారు. గంటల తరబడి లైన్‌లో నిలబడాల్సిన పరిస్థితి. ఇంటి పనులు, బయటి పనులు వదులుకొని రేషన్ కోసం గంటల కొద్ది వేచి చూడాల్సి వస్తుందని లబ్ధిదారులు వాపోతున్నారు. దీనికి తోడు ఎండలు ఎక్కువగా ఉండడంతో ఎండలో నిలబడక లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు.

నిల్వలపై ఆందోళన..

సాధారణంగా ప్రతి నెలా 16నుంచి 20వ తేదీల మధ్య రేషన్ బియ్య పంపిణీ పూర్తవుతుంది. కాగా ఈ సారి బియ్యం మూడు నెలలకు ఒకే సారి పంపిణీ చేయడంతో ప్రక్రియ ఆలస్యమవుతుంది. దీంతో బియ్యం నిల్వలు అయిపోతాయన్న ఆందోళనతో కార్డుదారులు రేషన్ దుకాణాలకు పరుగులు పెడుతున్నారు. దీంతో దుకాణాల వద్ద రద్దీ నెలకొంటుంది. దీనికి తోడు పంపిణీలో సాంకేతిక సమస్యతో తమకు రేషన్ అందుతుందో లేదోనని కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాలుగు గంటలు వేచి ఉన్న



"రేషన్‌బియ్యం తీసుకోవడానికి నాలుగు గంటల పాటు వేచి ఉండి బియ్యం తీసుకున్నా. ఒక్కొక్కరికీ మూడు సార్లు వేలిముద్ర వేయాల్సి రావడంతో పాటు మధ్య సర్వర్ బీజీ వంటి సమస్యలతో వేచి ఉండే సమస్య తలెత్తుతుంది.

– పేరబోయిన వెంకటేశ్వర్లు, లబ్ధిదారుడు, రాఘవాపురం

గంటల కొద్దీ నిలబడాల్సివస్తోంది



"మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తున్నారని దుకాణం వద్దకు వస్తే ఇక్కడ గంటల కొద్దీ నిలబడాల్సి వస్తోంది. జనం ఒకేసారి ఎగబడడంతో ఒత్తిడి పెరిగి సర్వర్ మొరాయించడంతో లబ్ధిదారులు వేచి చూడాల్సి వస్తుంది.

– దాసు శ్రీలక్ష్మి, వెల్లటూరు

క్లుప్తంగా

వృద్ధాశ్రమంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

మునగాల : మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామానికి చెందిన తిమ్మారెడ్డి కోటిరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆదివారం మండలంలోని ముకుందాపురం ఇందిరా అనాథ వృద్ధాశ్రమంలో ఆయన జ్ఞాపకార్థంగా కుటుంబ సభ్యులు వృద్ధులకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బంధు మిత్రులు తిమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, నందిని, వినీల, శివారెడ్డి, నందిగామ సైదులు, సందీప్ ఉన్నారు.

ముగిసిన బంగారు మైసమ్మ జాతర

నడిగూడెం : మండల పరిధిలోని రామాపురంలో రెండు రోజులుగా కొనసాగుతున్న బంగారు మైసమ్మ జాతర ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత



ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని తిలక్‌నగర్‌కు చెందిన ఆటో కార్మికుడు గొర్రె వీరబాబు ఇటీవల మృతి చెందారు. ఆదివారం మఠంపల్లి ఆటో యూనియన్ నాయకులు వీరబాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం తమవంతుగా మృతుడి భార్య వీరకుమారికి రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రాజీవ్‌గాంధీ ఆటో యూనియన్ అధ్యక్షుడు హుస్సేన్, డీఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ దగ్గుపాటి బాబురావు, నరసింహారావు, నాగరాజు, జోష్, బాలస్వామి, హుస్సేన్, రామయ్య, గోపి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

మునగాల : యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్తు పదార్థాల వినియోగంతో నేటి యువత జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మారి, చదువుకు దూరమై అనారోగ్య సమస్యలు తెచ్చుకుంటున్నారని అన్నారు. మండలంలో డ్రగ్స్ నిర్మూలనకు అందరి సహకారం కావాలని కోరారు.

రహదారిపై కూలిన చెట్ల తొలగింపు



రహదారిపై కూలిన చెట్లను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

గరిడేపల్లి : మండలంలోని గరిడేపల్లి–పొనుగోడు గ్రామాల మధ్యలో ఆదివారం సాయంత్రం వచ్చిన గాలివానతో రహదారి పక్కన ఉన్న చెట్లు రోడ్డుపై విరిగి పడ్డాయి. దీంతో విషయం తెలుసుకున్న పొనుగోడు గ్రామపంచాయతీ సిబ్బంది వర్షంలో వెళ్లి రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్లను తొలగించారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది గోపగాని సత్యం, అనుముల హరీష్, చిటికెల రాజు, మిడిసనమెట్ల వీరబాబు, వేముల నాగరాజు, నేలపట్ల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీలక్ష్మీనృసింహుడి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న వేదపడింతులు

చివ్వెంల : జ్యేష్ఠ మాస స్వాతి నక్షత్రం సందర్భంగా ఉండ్రుగొండలోని శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీమాన్ అరుట్ల రవికుమార చార్యులు, శ్రీమాన్ క్రిష్ణమాచార్యులు మంత్రోచ్చరణతో స్వామి వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు చకిలం క్రిష్ణకుమార్, బందకవి క్రిష్ణమోహన్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి



నేరేడుచర్ల : సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం పట్టణ కార్యదర్శి నగేష్

నేరేడుచర్ల : హుజూర్‌నగర్ పట్టణంలో ఈ నెల 10, 11, 12తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని ఆ పార్టీ పట్టణ కార్యదర్శి కొదమగుండ్ల నగేష్ అన్నారు. ఆదివారం స్థానికంగా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ శిక్షణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విధానాలపై మూడు రోజుల పాటు జరగనున్నట్లు తెలిపారు. కగార్ పేరుతో మావోయిస్టులను కాల్చి చంపడం ప్రజాస్వామ్యాన్ని ఖూని చేయడమేనన్నారు. వెంటనే ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలన్నారు. సమావేశంలో నాయకులు నీలా రాంమ్మూర్తి, శ్రీను, సట్టు శ్రీను, గుర్రం ఏసు, వెంకటేశ్వర్లు, కృష్ణవేణి, వెంకటయ్య తదితరులున్నారు.

నడిగూడెం : హుజూర్‌నగర్ పట్టణంలో ఈ నెల 10, 11, 12తేదీల్లో నిర్వహించనున్న సీపీఎం జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి బెల్లంకొండ సత్యనారాయణ ఆదివారం తెలిపారు. మండలానికి చెందిన అన్ని గ్రామ కమిటీల సభ్యులు, మండల కమిటీల సభ్యులు శిక్షణలో పాల్గొనాలని కోరారు. ఈ శిక్షణ తరగతులకు రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి, మల్లు లక్ష్మి హాజరుకానున్నట్లు తెలిపారు.

ప్రతిఒక్కరూ సమాజ సేవకు పాటుపడాలి



సొసైటీ లోగోను ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

నేరేడుచర్ల : ప్రతిఒక్కరూ సమాజ సేవకు పాటుపడాలని వికాసియన్స్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీ సభ్యులు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని వికాస్ జూనియర్ కళాశాలలో 1993–95సంవత్సరంలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు వికాసియన్స్ రూరల్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ సొసైటీని ఏర్పాటు చేసి ప్రారంభించుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థుల సమావేశంలో వారు పలు నిర్ణయాలు తీసుకున్నారు. ప్రధానంగా సమాజ సేవకై ప్రతి సంవత్సరం మూడు సార్లు, నెలకు ఒక ఆరోగ్య శిబిరం చొప్పున సంవత్సరానికి నాలుగు ఆరోగ్య శిబిరాలు నిర్వహించడంతో పాటు విద్యారంగానికి సంబంధించి పేద విద్యార్థులకు తమవంతు సహకారం అందించే విధంగా ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించారు. నెల వారీగా సభ్యత్వ రుసుముతో నిధులు ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించారు. ఈ సొసైటీకి వికాస్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గోళ్ల సుధాకర్ ఆధ్వర్యంలో అధ్యక్షుడిగా డాక్టర్ కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా గంధం జానయ్య, కోశాధికారిగా వెంగళరావు బాధ్యతలు నిర్వహిస్తారని సొసైటీ సభ్యులు వెల్లడించారు.

మహోన్నత వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్న



సర్వాయి పాపన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కోదాడరూరల్ : పేద ప్రజల కోసం పోరాడి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మహోన్నత వ్యక్తి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని రాష్ట్ర గీత సహకార కార్పొరేషన్ మాజీ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని ఎర్రవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని ఆయన సందర్శించి మాట్లాడారు. 16వ శతాబ్దంలో బహుజనులను ఇబ్బందులకు గురిచేస్తున్న మొఘల్ చక్రవర్తులకు వ్యతిరేకంగా పోరాడి వారి పాలన నుంచి విముక్తి కల్గించిన యోధుడని కొనియాడారు. ఓ సాధారణ గీత కార్మికుడిగా ఉంటూ బహుజన కులాలను ఏకం చేసి పేద ప్రజల కోసం ఉద్యమించిన పాపన్నను ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గౌడ కులస్తులు ఐక్యంగా ఉంటూ ప్రతి గ్రామంలో పాపన్న గౌడ్ విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయన వెంట జైగౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బూర మల్సూర్‌గౌడ్, గౌడ సంఘం నాయకులు బొడ్డుగోపాల్ గౌడ్, గ్రామ గౌడ పెద్దలు ఉన్నారు.

ఘనంగా కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన



మోతె : సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న బొల్లం మల్లయ్యయాదవ్



చిలుకూరు : పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్, భక్తులు

మోతె : మండల పరిధిలో ఉర్లుగొండ గ్రామంలో గౌడ కులస్తుల ఆరాధ్య దైవమైన శ్రీశ్రీ కంఠమహేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కంఠమహేశ్వరస్వామి ఆశీస్సులు గౌడ కులస్తులతో పాటు యావత్ ప్రజానికానికి ఉండాలని కోరుకున్నారు. అనంతరం సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సర్దార్ సర్వాయి పాపన్న 17వ శతాబ్దంలో బహుజన రాజుగా చరిత్ర పుటల్లో నిలిచారని, ఆయన నేటి సభ్య సమాజానికి ఆదర్శమన్నారు. కార్యక్రమంలో గౌడ సంఘం రాష్ట్ర నాయకులు రాధాకృష్ణ, కట్ల నర్సయ్య, పల్సు మల్సూర్, ఏలూరి వెంకటేశ్వరరావు, గౌడ్ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండల కేంద్రంలో గీత పారిశ్రామిక సంఘం, గౌడ కులస్తుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీ కంఠమహేశ్వర సురాంబదేవి ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు పీతలపై కూర్చొని స్వామి వారి కల్యాణం జరిపించారు. అనంతరం అన్నదానం చేపట్టారు. అదే విధంగా స్వామివారికి బోనాలు సమర్పించారు. పూజల్లో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, చిలుకూరు ఎస్‌ఐ రాంబాబు, పల్లె రవి కుమార్‌గౌడ్, విగ్రహాల దాత నారగాని శంకర్‌గౌడ్, బూర మల్సూర్ గౌడ్, గౌడపెద్దలు పాల్గొన్నారు.

ఉపాధి పనులతో మేజర్ కాల్వలకు మోక్షం



తెల్లబెల్లి వద్ద పూడిక తీసిన కొమరబండ మేజర్ కాల్వ

నడిగూడెం : మండల పరిధిలోని పలు గ్రామాల్లో కొద్దిరోజులుగా ఉపాధిహామీ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. దీంతో ఎకలాస్‌ఖాన్‌పేట, తెల్లబెల్లి గ్రామాల వద్ద కొమరబండ మేజర్‌కాల్వ, నడిగూడెంలో ఎల్–34 ఎత్తిపోతల పథకం మేజర్ కాల్వ, కరివిరాల ఆవాస గ్రామమైన వెంకట్రాంపురం వద్ద ఉన్న శ్రీరాంసాగర్ మేజర్‌కాల్వల్లో పూడికలు తీస్తుండడంతో బాగుపడుతున్నాయి. ఉపాధి పథకం ద్వారా కాల్వల్లో పూడికలు తీస్తుండడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యాపారులు విధిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి



తడి, పొడి చెత్తపై గృహిణులకు అవగాహన కల్పిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్

సూర్యాపేట అర్బన్ : వ్యాపారులు విధిగా ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం 100 రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలోని 7వ వార్డులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందివ్వాలని, మురికి కాలువలలో రోడ్లపై చెత్త వేయవద్దని అన్నారు. వీధి కుక్కల పట్ల జాగ్రత్త వహించి చిన్న పిల్లలను కుక్కల వద్దకు వెళ్లకుండా చూడాలని తెలిపారు. పెంపుడు కుక్కలకు టీకాలు వేయించి మెడకు బెల్ట్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం వార్డుకు నీటిని సరఫరా చేసే పైపు నుంచి నీటిని తీసుకొని క్లోరినేషన్ టెస్టింగ్ చేశారు. నిరుపేద మహిళలను గుర్తించి వారిని స్వయం సహాయక సంఘంగా ఏర్పాటు చేసుకొనుటకు ప్రతిపాదనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, సయ్యద్ సమ్మి, టీఎంసీ శ్వేత, గుండు నాగరాజు, జవాన్ శ్రవణ్, మెప్మా సిబ్బంది, పారిశుద్ధ్య, నీటి సరఫరా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపూరి రాజు

చిలుకూరు : గ్రామగ్రామాన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ముందస్తుగా సమావేశాలు నిర్వహించి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎంఎస్‌పీ జిల్లా అధికార ప్రతినిధి ఏపూరి రాజు మాదిగ అన్నారు. ఆదివారం మండలంలోని జరిగిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సోమవారం కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా ఎమ్మార్పీఎస్ సమావేశం నిర్వహిస్తున్నట్లు, ఈ సమావేశానికి ఎమ్మార్పీఎస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. వచ్చే నెల 7న గ్రామాల్లో ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు వడ్డేపల్లి కోటేష్, మండల అధ్యక్షుడు మల్లెపంగు సూరి బాబు, జిల్లా, మండల నాయకులు సిద్దెల శ్రీను, కందుకూరి కృష్ణమూర్తి, ముదిగొండ బాలు, రాకేష్, అశోక్, వీరబాబు, మహేష్, సాయి, ధర్మతేజ్, శ్రీకాంత్, ఎల్లయ్య, సైదులు, ప్రశాంత్, రాంబాబు, క్రాంతి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

నేరేడుచర్ల : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని, ప్రతిఒక్కరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని నేరేడుచర్ల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం బట్టు మధు అన్నారు. ఆదివారం పట్టణంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎంతో అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థికి ప్రభుత్వం అన్ని వసతులు కల్పిస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీరబాబు, రషీద్‌ఖాన్, శౌరీ, నరసింహారావు, జానయ్య తదితరులున్నారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పొనుగోడులో వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

గరిడేపల్లి : గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ఉచితంగా నిర్వహించే వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని వైద్యాధికారులు అనంత నాగు, ప్రియాంక అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పొనుగోడు గ్రామంలో లయన్స్ క్లబ్ ఆఫ్ నేరేడుచర్ల ఆధ్వర్యంలో యూనియన్ డయాగ్నస్టిక్ సెంటర్ మార్కెట్‌లో లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ జిలకర రామస్వామి అధ్యక్షతన ఉచిత మెగా శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉచితంగా మందులు ఇవ్వడంతో పాటు షుగర్, బీపీ పరీక్షలు చేసి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడారు. లయన్స్ క్లబ్ పేద ప్రజల సేవే మార్గంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో సైదిరెడ్డి, చింతకుంట్ల పూర్ణచంద్రారెడ్డి, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు, వెంకట్‌రెడ్డి, సాయి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం



హుజూర్‌నగర్‌లో కురుస్తున్న వర్షం



మఠంపల్లి : పెదవీడు శివారులో ఈదురుగాలులకు లేచిన ఇంటి పైకప్పురేకులు

హుజూర్‌నగర్ : పట్టణంలో ఆదివారం సాయంత్రం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు విపరీతంగా ఎండతో సాయంత్రం వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. తొలుత భారీగా ఈదురుగాలులు వీచాయి. అనంతరం దాదాపు అర్ధగంట కూడిన వర్షం కురిసింది. సాయంత్రం వాతావరణ చల్లబడడంతో ప్రజలకు ఒకింత ఉపశమనం లభించినట్లైంది.

గాలులకు కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు

హుజూర్‌నగర్ రూరల్ : మండలంలోని గోపాలపురంలో ఆదివారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో పాటు ఈదురుగాలులకు విద్యుత్ స్తంభాలతో పాటు చెట్లు నెలవాలాయి. కాగా గ్రామంలో ఓపూరిగుడిసే పక్కన వేటచెట్టు విరిగిపడడంతో ప్రాణాపాయం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

పెదవీడులో కూలిన ఇల్లు

మఠంపల్లి : మండలంలోని పెదవీడు సమీపంలోని అమరేశ్వరి సిమెంట్స్ పరిశ్రమ వద్ద మీసాల మధుబాబు ఇల్లు ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులు, వర్షానికి కూలిపోయింది. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడారు. ఈదురుగాలులు, వర్షానికి ఇంటి పైకప్పు రేకులు లేచిపోయి తలుపులు, కిటికీలు, ప్యాన్లు ధ్వంసమయ్యాయని, సుమారు రూ.లక్ష నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



హుజూర్‌నగర్‌రూరల్ : వేపలసింగారంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



గరిడేపల్లి : సమ్మేళనంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని వేపలసింగారం ఆర్‌సీఎం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2001–2002లో పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులు స్థానికంగా ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ ఉపాధ్యాయులతో కలిసి ఆడిపాడారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ సబిన, హెచ్ఎం ఉష, పూర్వ ఉపాధ్యాయులు చంద్రం, చిన్నపురెడ్డి, అచ్చిరెడ్డి, రమణ, జనార్దన్, శౌరీలు, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల పరిధిలోని గడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2006–07 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యనభ్యసించిన విద్యార్థులు ఆదివారం స్థానికంగా ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. 18ఏళ్ల తర్వాత కలుసుకున్న నాటి విద్యార్థులంతా ఒకేచోట చేరి జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పి నేడు సమాజంలో ఉన్నతంగా ఎదిగేలా తీర్చిదిద్దిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు వెంకటప్పయ్య, పూర్ణచంద్రారెడ్డి, మధుసూదన్, బుచ్చిరెడ్డి, శ్రీను, మంగళ, అనిత, భిక్షపతి, వెంకట్‌రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మృగశిర సందడి

హుజూర్‌నగర్ : మృగశిర కార్తె ప్రారంభం సందర్భంగా ఆదివారం పట్టణంలో చేపలు కొనేందుకు జనం ఎగబడ్డారు. దీంతో చేపల మార్కెట్, బయట కొనుగోలు దారులతో సందడిగా మారింది. కార్తె తొలిరోజు చేపలు తినాలనే నానుడి నేపథ్యంలో పలువురు చేపలు కొనేందుకు ఆసక్తి చూపారు. ఇదే అదునుగా కొందరు చేపల ధరలను పెంచి విక్రయించారు. సాధారణంగా రూ.100 ఉన్న చేపలు సైతం రెండు వందలకు పైగా రేటుకు విక్రయించారు. చేపలకు డిమాండ్ ఎక్కువగా ఉండడంతో వివిధ ప్రాంతాల నుంచి పలువురు చేపల విక్రయదారులు ఇక్కడకు వచ్చి అమ్మకాలు చేశారు.

గరిడేపల్లి : మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం మృగశిర కార్తె సందడి కనబడింది. రోహిణి కార్తె పోయి మృగశిర కార్తె వచ్చి వాతావరణం చల్ల పడుతుందని ఆనందంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. సెంటిమెంట్‌గా చేపలు తింటే మంచిదని నానుడి ఉండడంతో పెద్దఎత్తున చేపలు కొనుగోళ్లు చేసి కార్తె జరుపుకున్నారు. గరిడేపల్లిలో చేపల అమ్మకాలు జోరుగా సాగాయి.



హుజూర్‌నగర్‌లో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు